క్లుప్తంగా

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీవిద్య

పెంచికల్‌పేట్: అర్హులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో శ్రీవిద్య అన్నారు. సోమవారం కొండపల్లి గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నూతనంగా పట్టా పాసుపుస్తకాలను కలిగి ఉన్న రైతులు పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్సుతో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

కౌటాల: అర్హులైన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏవో రాజేశ్ సోమవారం తెలిపారు. రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా పథకంలో రూ.5లక్షల సాయం అందిస్తుందన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు ఫారం, పట్టా పాస్ బుక్ జిరాక్స్, రైతు, నామినీల ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను ఏఈవోలకు అందించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బొంబాయిగూడ గ్రామానికి చెందిన గొగు అంకుబాయి ఇల్లు కూలిపోగా సోమవారం ఎస్సై కొమురయ్య బాధిత మహిళలకు 40 కిలోల బియ్యం, దుప్పట్లు, రూ.2వేలు ఆర్థికసాయం అందజేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై ప్రభాకర్, సిబ్బంది సారయ్య, సామాజిక కార్యకర్త ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

టీఎల్ఎం ప్రదర్శన




టీఎల్ఎంను తయారు చేయిస్తున్న టీచర్

కెరమెరి: జాతీయ విద్యావారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు టీఎల్ఎంతో తయారు చేసిన ప్రదర్శన ఇచ్చారు. గణితం, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన బోధన సామగ్రితో అభ్యాసన ప్రక్రియలను తయారు చేసి ప్రదర్శన చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికి తెచ్చారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, భరత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వాగుల వద్ద కంచెలు ఏర్పాటు

కెరమెరి: మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రజలు వాగులు దాటకుడదని ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌లు సోమవారం లక్మాపూర్, కరంజివాడ, అనార్‌పల్లి వాగుల వద్ద ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు.

రోగికి రూ. 2.50లక్షల ఎల్వోసీ



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్

కెరమెరి: కిడ్నీవ్యాధితో బాధపడుతున్న మండలంలోని సుల్తాన్‌గూడకు చెందిన జులేఖాబికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2,50,000 ఎల్వోసీని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మంజూరు చేసినట్లు ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ తెలిపారు. గడిచిన ఆరు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితుడి విషయాన్ని ఆసిఫాబాద్ డీసీసీ విశ్వప్రసాద్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బాధితుడి తమ్ముడు అహ్మద్ చావుశ్‌కు సోమవారం రూ.2.50 లక్షల ఎల్వోసీ (లెటర్ ఆఫ్ కాన్సెంట్) అందించారు.

అధ్వానంగా రహదారులు



బురదమయంగా కౌటగాంకు వెళ్లే దారి



చందుగూడకు వెళ్లే దారి..

- బురదమయంగా గ్రామీణ రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిర్యాణి: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామాల నుంచి బయటకు రావాలంటే ఎడ్లబండ్లే దిక్కవుతున్నాయి. కనీసం అంబులెన్స్‌లు కూడా గ్రామాలకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అత్యవసర సమయంలోనూ గర్భిణులు, రోగులను ఎడ్లబండ్లలోనే తరలించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని గ్రామాలకు వెళ్లే దారులపై మోకాళ్లలోతు బురద ఉండటంతో ఎడ్లబండ్లు కూడా కూరుకుపోతున్నాయి. దీంతో ఆదివాసీల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండలంలోని తాటిగూడ, ఎర్రబండ, గీసుగూడ, పూనగూడ, కొత్తగూడ, కౌటగాం, చందుగూడ గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ మారుమూల గ్రామాల్లో గోండు, కొలాం తెగలకు చెందిన గిరిజనులు నివాసం ఉంటున్నారు.

కాలిబాటలే దిక్కు..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో అడవి బాటలు(రోడ్డు) ఆదివాసీలకు దిక్కుగా మారుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై కాలుతీసి కాలు పెట్టలేనంత బురదగా మారుతున్నాయి. ఒక్కోసారి దారి ఆనవాళ్లు కూడా కనబడని దుస్థితి నెలకొంటుంది. ఏటా వర్షాకాలంలో ఆయా గ్రామాలకు బహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. సరైనా రహదారి కూడా లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోతోంది. దీనికి తోడు గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉండటంతో రాకపోకలు పూర్తిగా తెగిపోతున్నాయి. ఈ సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే..

వర్షాకాలంలో గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కాలినడకతోనే ఇతర గ్రామాలకు వెళ్తుంటారు. ప్రతీ నెల నిత్యావసర సరుకుల కొనుగోలుకు, రేషన్ బియ్యం తీసుకోవడానికి, ఆసరా పింఛన్ల కోసం సుమారు ఆరు కిలోమీటర్ల కాలినడకన దాంపూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో తిర్యాణి మండల కేంద్రానికి చేరుకొని అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



దాదాపు ఆరు కిలోమీటర్ల మేర అడవిదారంతా బురదమయంగా మారింది. మోకాళ్ల లోతు బురదలో నడవడానికి అవస్థలు పడుతున్నాం. గ్రామానికి ఎలాంటి వాహనాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో కాలినడకనే వెళ్తున్నాం. అత్యవసర సమయంలో సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వాగులపై కల్వర్టులను నిర్మించడంతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– కోట్నాక గణపతి, తాటిగూడ

సింగరేణి సొమ్ము పథకాలకు కేటాయించొద్దు



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్ రావు

రెబ్బెన: సింగరేణి కార్మికులు తమ రక్తాన్ని చెమటగా చిందిస్తూ సంస్థకు లాభాలు తెచ్చిపెడుతుంటే, సింగరేణి డబ్బులను రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి కార్మికులు కష్టపడి సాధించిన లాభాల్లో నుంచి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్‌గాంధీ సివిల్స్ భరోసా పథకానికి ఇవ్వడం సరికాదన్నారు. ఇన్‌కం ట్యాక్స్ పేరిట పన్నులు వసూలు చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థ నుంచి పన్నుల రూపంలో కోట్లాది రుపాయలు తీసుకుంటున్నాయన్నారు. సింగరేణి సొమ్ము వృథా కాకుండా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడాలని పేర్కొన్నారు. సింగరేణి సొమ్ము సింగరేణి ప్రాంతాల అభివృద్ధికి, సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పరిసరాలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: సీజనల్ వ్యాధులపై పాఠశాలల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, కేజీబీవీల్లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణలో దోమల మందు పిచికారీ చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌పై వినతిపత్రాల అందజేత



దహెగాం: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కాగజ్‌నగర్‌లో..

దహెగాం: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో బీసీ డిక్లరేషన్‌పై ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడిచినా పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ కమిటీ, గొల్లకుర్మలకు ఇస్తామన్న గొర్రెలు, మత్స్యకారులకు చేప పిల్లలను త్వరగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి సామెర మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పడాల సురేశ్, నాయకులు దెబ్బటి సత్యనారాయణ, పుప్పాల లక్ష్మినారాయణ, తోట చందు, శ్రీకాంత్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

తిర్యాణి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు గాయంగి తిరుపతి, ఎస్టీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడం సుభాశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తొడసం భాస్కర్, నాయకులు రంగు అరుణ్ కుమార్, బారిక్ రావు తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ అన్నారు. సోమవారం బీసీ మోర్చ ఆధ్వర్యంలో ఎంఆర్వో కార్యాలయంలో డీటీ పోచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మల్లి కార్జున్, సత్యనారాయణ, పెంటయ్య, ప్రహ్లాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దిలీప్‌కు వినతిపత్రం అందించారు. బీసీ సబ్‌ప్లాన్ కమిటీను ఏర్పాటు చేయాలని, గొల్ల కుర్మలకు గొర్రెలు, మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, నాయకులు సత్తయ్య, మిథున్, ఎల్ములే మధుకర్, శ్రీనివాస్, భూమయ్య, నర్సింహరావు, సంపత్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీదేవి, రాణి, నాయకులు రమేశ్, సిందం శ్రీనివాస్, అశోక్, చన్కపురి గణపతి, పుల్ల అశోక్, శ్రీనివాస్, అరుణ్ లోయా, గణపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో..



తిర్యాణి: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సాధిక్‌పాషా

చింతలమానెపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సాధిక్‌పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గాయత్రి హైస్కూల్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి చదువులో రాణించాలన్నారు. మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపొద్దని, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, పాఠశాల సిబ్బంది శ్రీధర్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

వంజీరి గ్రామస్తులను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామస్తులను ఆదుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కాగజ్‌నగర్ నుంచి వంజీరికి వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, కోకన్వీనర్ మోయిన్, నాయకులు సీపీ రాజ్ కుమార్, అంబాల ఓదెలు, కన్నయ్య, సలీం, మనోహర్, రాజు, రావూజీ, గోపాల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: రెబ్బెన మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండల కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే మండల కేంద్రంలోని దుర్గామాత అలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి దుర్గామాతను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ సౌందర్య, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, అశోక్, దుర్గారావు, అన్నపూర్ణ అరుణ, మురళీగౌడ్, మన్యం పద్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి సెల్‌ఫోన్‌ను గుర్తించి సోమవారం అప్పగించారు. ఎస్సై మధుకర్ మాట్లాడుతూ కొమ్ముగూడ గ్రామానికి చెందిన మాల్‌కార్ రాజేంద్రప్రసాద్ ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

ఎన్‌హెచ్ఎం జిల్లా అధ్యక్షుడిగా బోగె ఉపేందర్



బోగె ఉపేందర్

ఆసిఫాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా గోలేటికి చెందిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్‌ను ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరి గిన జిల్లా 2వ మహాసభల్లో ఎన్నుకున్నట్లు తెలిపా రు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం వారు జిల్లా కేంద్రంలో డీఆర్వో లోకేశ్వర్ రావుకు వినతిపత్రం అందించారు. క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చి రెగ్యులర్ చేయాలని కోరారు. నాయకులు సంతోష్, కోశాధికారి నగేష్, తిరుపతి, రాము, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



కాగజ్‌నగర్‌రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో పద్మశాలి సేవా సంఘం వార్డు ఇన్‌చార్జి శ్రీలత, మహిళా ఇన్‌చార్జి ప్రేమలత ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. పద్మశాలి ఆడపడుచులు గోరింటాకు పెట్టుకొని వేడుకల్లో పాల్గొన్నారు.

నేడు 'రైతునేస్తం'

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ సోమవారం తెలిపారు. నేడు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, శాస్త్రవేత్తలు నేరుగా రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారన్నారు. ఒక అభ్యుదయ రైతు తమ వ్యవసాయ అనుభవాలను రైతులతో పంచుకుంటారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు సకాలంలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడ గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి 4 సెల్‌ఫోన్‌లు, రూ.1900 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

తలమడుగు: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 ఇవ్వడం లేదన్నారు. మూడు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు నెలలు అంటే రూ.1 లక్ష 20 వేల రూపాయలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న, సీఐటీయూ ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

నార్నూర్: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రతీగ్రామంలో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఖైర్దాట్వా గ్రామాన్ని తనిఖీ చేశారు. శానిటేషన్, క్లోరినేషన్ పనులను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నీటి నిల్వ వలన దోమలు తయారై మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి రోగాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఆయన వెంట ఎంపీవో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

డబ్బులు డిమాండ్ చేసిన సైబర్ నేరగాళ్లు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. నజ్రూల్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు సైబర్‌నేరగాళ్లు ఫోన్ చేసి తాము పోలీసులను చెప్పుకొని బెంగుళూరులో ఉన్న సదరు మహిళ కుమారుడిపై కేసు నమోదైందని, తమకు రూ. 20వేలు వెంటనే ఫోన్‌పే చేయాలని, లేదంటే తన కుమారుడిని చంపివేస్తామని బెదిరించారు. వెంటవెంటనే వాట్సాప్ కాల్స్ చేస్తూ భయాందోళనకు గురి చేశారు. సదరు మహిళ సమీపంలో ఉన్న వారిని ఆశ్రయించింది. వారు వెంటనే మహిళ కుమారుడికి ఫోన్ చేసి ఆరా తీయగా, తాను క్షేమంగా బెంగుళూరులో ఉన్నానని వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈవిషయమై కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబును సంప్రదించగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే భయాందోళన చెందకుండా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.